# విజయానికి బాట పోటీ!

కవర్ స్టోరీ



ఓ పాతికేళ్ల క్రితం పరిస్థితి! ఇంట్లోకి ఫోన్ కావాలంటే ముందు ఓ అర్జీ పెట్టుకోవాల్సి వచ్చేది. దాని మీద ఉన్న క్రమ సంఖ్య ప్రకారం మూడు నెలలకో, ఆరు నెలలకో... ఒక్కోసారి ఏడాదికో ఫోన్ కనెక్షన్ వచ్చేది. మీ ఇంటి వరకు లైన్ లేదనో, పరికరాలు ఇంకా రాలేదనో, వర్షాకాలం తర్వాత పని మొదలుపెడతామనో... ఇలా ఆలస్యానికి రకరకాలుగా కారణాలు వినిపించేవి. చాలామంది ఆ బాధలు భరించలేక ఎస్టీడీ బూత్‌లను ఆశ్రయించేవారు. అక్కడ మరో సమస్య. రాత్రివేళల్లో చార్జీలు తక్కువ ఉంటాయని లైన్లో నిలబడి, పదిమంది అపరిచితుల ముందు పర్సనల్ విషయాలు చెప్పుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అదే పని గంట, రెండు గంటల్లో పూర్తయిపోతున్నది. టీవీల సంగతీ ఇంతే! నచ్చిన సినిమా దేవుడెరుగు. అసలు తెలుగు సినిమా, తెలుగు పాట వినడానికే ఎన్నో ప్రహసనాలు దాటాల్సి వచ్చేది. మరి ఇప్పుడో! నట్టిల్లే మల్టీప్లెక్స్‌గా మారిపోయింది. మన జీవనస్థాయి మెరుగుపడటం, సాంకేతికత పెరగడం, అవగాహన లాంటి విషయాలన్నీ ఇందుకు కారణం కావచ్చు. తమ సేవలను అలవాటు చేసేందుకు కొన్ని సంస్థలు చేసే మాయ ఉండవచ్చు. ఈ పరిణామానికి ప్రధాన కారణం పోటీతత్వమే! ఒకరి కీడును మరొకరు కోరుకునే పోటీతో అంతా నాశనం అవుతుంది. కానీ, ఒకరిని మించి మరొకరు ఎదగాలనుకునే ఆరోగ్యకరమైన పోటీ అందరికీ మేలుచేస్తుంది. సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. అందుకే అన్నారుగా పెద్దలు... 'స్పర్ధయా వర్ధతే విద్య' అని. అది ఏ రంగానికైనా అన్వయం అవుతుంది.

... కె.సహస్ర